క్లుప్తంగా

ఊపిరి పీల్చుకున్న రైతులు



మొగల్తూరు జాతీయ రహదారిపై ధాన్యాన్ని ఆరబెడుతున్న కూలీలు

మొగల్తూరు: వాతావరణం అనుకూలించడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకూ భారీ వర్షం కురవడంతో కళ్లాల్లో ఉన్న ధాన్యంతో పాటు రహదారులపై బరకాలు కప్పి ఉంచిన ధాన్యం కూడా తడిసిపోవడంతో రైతులు ఆందోళన చెందారు. చేతికొచ్చిన పంట నీటి పాలు కావడంతో పెట్టిన పెట్టుబడులు అంతా నీటి పాలైందని ఆవేదన చెందారు. అయితే వరుణుడు కరుణించడంతో మంగళవారం ఉదయం నుంచి భానుడు భగభగలాడటంతో తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టుకుని ఒబ్బిడి చేసుకునే పనిలో పడ్డారు. మండలంలో సుమారు 1190 ఎకరాల్లో దాళ్వా సాగు చేపట్టగా ఆలస్యంగా ఊడ్చిన రైతులు ఇటీవలే వరి కోతలు మొదలు పెట్టారు. మరో వారం రోజులు పాటు వరుణుడు కరుణిస్తే గట్టెక్కాస్తామని రైతులు చెబుతున్నారు.

పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

నరసాపురం: పట్టణంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ కాంట్రాక్టర్లకు సూచించారు. రెండో వార్డులో రూ.5 లక్షలు వ్యయంతో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంట్రాక్టర్లు పనులు సకాలంలో పూర్తి చేయడంతో పాటుగా నాణ్యత విషయంలో రాజీపడకుండా ఉండాలన్నారు. మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు ఈ విషయంలో నిరంతరం పర్యవేక్షించాలనఆనరు. పట్టణంలో ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు చేపట్టి పూర్తి చేస్తున్నామని చెప్పారు.

ముమ్మరంగా పంట బోదె తవ్వకం పనులు



నక్కావారిపాలెంలో పంటబోదె తవ్వుతున్న ఉపాధి కూలీలు

మొగల్తూరు: మండలంలోని పలుగ్రామాల్లో ఉపాధి పనులు ముమ్మరంగా జరుతున్నాయి. ప్రధాన కాలువను కట్టేయడంతో పూడిక పోయిన పంటబోదెలను తవ్వే పనులు చేపట్టారు. మంగళవారం మొగల్తూరు పంచాయతీలోని నక్కావారిపాలెం, ఇంజేటివారిపాలెం, పాలకమ్మ చెరువు, తదితర ప్రాంతాల్లో పంట బోదె తవ్వకం పనులు ప్రారంభించారు. కాలువలు వదిలే నాటికి పూడికపోయిన పంటబోదెల్లోని మట్టిని పూర్తిగా తొలగిస్తామని ఏపీఓ వై.శ్రీనివాస్ తెలిపారు.

రాజమండ్రి వెళ్లి వృద్ధాప్య పింఛన్ అందజేత



రాజమండ్రిలో పింఛన్ అందిస్తున్న కడిమి ప్రభాకర్

పెనుమంట్ర: మార్టేరుకు చెందిన మజ్జి భూసియ్య అనే వృద్ధుడు జగనన్న ప్రభుత్వంలో వృద్ధాప్య పింఛన్ పొందుతున్నాడు. ఇటీవల బూసియ్య క్యాన్సర్ వ్యాధికి గురికావడంతో గత కొంతకాలంగా రాజమండ్రిలో చికిత్స పొందుతున్నాడు. బూసియ్యకు మార్టేరు వచ్చే పరిస్థితి లేకపోవడంతో మంగళవారం గ్రామ వలంటీర్ కడిమి ప్రభాకర్ రాజమండ్రి వెళ్లి ఆయనకు పింఛన్ సొమ్ము అందజేశారు.

ఇంటికి దారి ఇప్పించాలని వినతి

యలమంచిలి: ఇలపకుర్రు పంచాయతీ సిర్రావారిపేటకు చెందిన సిర్రా రవితేజ గ్రామ వలంటీర్‌గా పని చేస్తున్నాడు. 10 నెలల నుంచి రవితేజ ఇంటికి వెళ్లే దారిలో ఇళ్లలో వాడకం నీరు వదిలేస్తూ అతని పెదనాన్న కుమారులు ఇబ్బందులు గురి చేస్తున్నారు. దీంతో రవితేజ స్పందనలో ఫిర్యాదు చేశారు. అధికారులు వచ్చి చూసి జిరాయితీ భూమి సమస్య మీరే తీర్చుకోండి అని చెప్పి వెళ్లిపోయారు. దీంతో మరింత రెచ్చిపోయిన పెదనాన్న కుమారులు వారం క్రితం దారికి ప్లాస్టిక్ బరకం కట్టి మూసివేశారు. దీంతో రవితేజ కుటుంబ సభ్యులు ఇంటిలో నుంచి బయటకు వెళ్లే మార్గం లేక ఇబ్బందిపడుతున్నారు. దీంతో మాకు దారి చూపించండి మహాప్రభో అంటూ చంద్రరావు అతని కుటుంబ సభ్యులు అధికారులను వేడుకుంటున్నారు.

వంతెన యాతన తీర్చేదెవరు?

- ప్రమాదకరంగా కాలిబాట వంతెనలు
- తమ పరిధి కాదంటున్న అన్ని శాఖల అధికారులు



శిథిలావస్థలో ఉన్న ఎర్ర వంతెన



నాగరాజు పేట వైపు ప్రమాదకరంగా ఉన్న వంతెన



బ్రాడీపేట బైపాస్ రోడ్డు వైపు సైడ్ రెయిలింగ్ పోయిన వంతెన

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలో నరసాపురం, నిడదవోలు కెనాల్‌పై మూడు కాలిబాట వంతెనలు ఉన్నాయి. కాలువకు అవతల ఉన్న మావుళ్లమ్మపేట, బ్రహ్మానందరెడ్డి కాలని ప్రజలకు, రైల్వే స్టేషన్‌కు వెళ్లే ప్రయాణీకులకు, పాలకొల్లు రూరల్ పంచాయతీ నాగరాజు పేట, సాయినగర్ కాలనీ, వడ్లవానిపాలెం, వేడంగి పాలెం గ్రామ ప్రాంతాల నుంచి పట్టణానికి వచ్చి వెళ్లే ప్రజలకు ఈ మూడు వంతెనలు చాలా ముఖ్యమైనవి. ఈ మూడు వంతెనలు గాంధీబొమ్మల సెంటర్ వద్ద ఉన్న దాసరి నారాయణరావు కాలిబాట వంతెన, ఎర్ర వంతెన, బ్రాడీపేట బైపాస్ రోడ్డు వంతెనలు నడిచి వెళ్లడానికి, మోటర్ వాహనాలపై వెళ్లడానికి అనుకూలంగా ఉన్నాయి. భారీ వాహనాలు రావాలంటే లాకులు వద్ద ఉన్న వంతెనలే ప్రధాన రహదారులుగా ఉన్నాయి. ఈ మూడు వంతెనల్లో ఎర్రవంతెన నడిచి వెళ్లడానికి మాత్రమే ఉపయోగపడుతుంది. ఈ వంతెనను 1951లో నిర్మించారు. అలాగే 1994లో నిర్మాణం చేసిన బ్రాడీపేట వంతెన అప్పుడే శిథిలావస్థకు చేరుకుంది. జనాభా పెరగడంతో ఈ వంతెనలపై వాహనదారుల రద్దీ కూడా పెరిగింది. ప్రస్తుతం దాసరి నారాయణరావు వంతెన ఒక్కటే అనుకూలంగా ఉండగా ఈ రెండు వంతెనలు మాత్రం ప్రమాదకరంగా ఉండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అత్యవసరమైతే ఈ ప్రమాదకరమైన వంతెనలపైనే ప్రయాణం చేయాల్సి వస్తుంది. ఎర్రవంతెన నిర్మాణం జరిగి 70 సంవత్సరాలు కావస్తుంది. కానీ నేడు నడవడానికి కూడా అనుకూలంగా లేని దుస్థితిలో ఉంది. బ్రాడీపేటలో నిర్మించిన వంతెన 29 ఏళ్లకే శిథిలావస్థకు చేరుకుంది. సైడ్ రెయిలింగ్ ఊడిపోయి అత్యంత ప్రమాదకరంగా ఉన్నాయి. ఆదమరిచినా, రాత్రి సమయంలో లైట్లు లేకపోయినా ప్రమాదాలకు నిలయంగా ఈ వంతెన ఉండడం ప్రజలను భయాందోళనకు గురి చేస్తుంది. ఈ వంతెనకు మరమ్మతులు చేయించి రెయిలింగ్ మళ్లీ నిర్మాణం చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

వంతెనల నిర్మాణం

1946లో నరసాపురం కెనాల్ ఫుట్‌బ్రిడ్జి (ఎర్రవంతెన) నిర్మాణంకొరకు అప్పటి మునిసిపల్ చైర్మన్ బీవీ సుబ్బారావు ఫౌండేషన్ చేయగా, 1951లో అప్పటి మద్రాసు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి ఏబీ షెట్టి, మునిసిపల్ చైర్మన్ ఆచంట పెదగోపాలం ఆధ్వర్యంలో ఈ వంతెనను ప్రారంభించారు. ఈ వంతెన శిథిలావస్థలో ఉండగా ఓఎన్‌జీసి సౌజన్యంతో 1993లో మరమ్మతులు చేశారు. 1994లో పంచాయతీరాజ్ శాఖ నిధులతో బ్రాడీపేట బైపాస్ వద్ద కాలిబాట వంతెనను నిర్మించారు. స్థానిక గాంధీబొమ్మల సెంటర్ నందు నిర్మించిన కాలిబాట వంతెనను 2003లో రాజ్యసభ సభ్యులు దాసరి నారాయణరావు రాజ్యసభ నిధులతో కాలిబాట వంతెన నిర్మించారు.

మావి కాదంటున్న అధికారులు

పట్టణంలో బ్రాడీపేట బైపాస్ రోడ్డువద్ద ఉన్న నాగరాజు పేట కాలిబాట వంతెన అత్యంత ప్రమాదకరంగా ఉంది. కాలువ అవతల రూరల్ పంచాయతీ, ఇటు వైపు మునిసిపల్ పరిధిలోఉన్న ఈ వంతెన 1994లో పంచాయతీరాజ్ శాఖ అధికారులు నిర్మించారు. దీని మెయింటెనెన్స్ మాత్రం ఎవరు చేస్తున్నారనేది ప్రశ్నార్థకంగా ఉంది. ప్రస్తుతం ప్రమాదకరంగా ఉన్న ఈ వంతెన మరమ్మతులు నిమిత్తం పంచాయతీరాజ్‌శాఖ అధికారులు, మునిసిపల్ శాక అధికారులు, గ్రామ పంచాయతీశాఖ అధికారులు ముగ్గురూ మా పరిధిలో లేదని చెప్పడం గమనార్హం. పంచాయతీరాజ్ శాఖ అధికారులు నిర్మాణం మాత్రమే మా పరిధిలో ఉందని తద్వారా తాము నిర్మించామని చెపుతున్నారు. మునిసిపల్ అధికారులను ప్రశ్నిస్తే అది పంచాయతీరాజ్ అధికారులు నిర్మించారని తమకు అప్పగించలేదని దాని మెయింటెనెన్స్ ఎవరు చూస్తున్నారో తెలియదు. మాకు రాతపూర్వకంగా ఆ వంతెన అప్పగిస్తే తామే మరమ్మ తులు చేయిస్తామని మునిసిపల్ అధికారులు చెపుతున్నారు. గ్రామ పంచాయతీశాఖ అధికారులను ప్రశ్నిస్తే గతంలో మరమ్మతులు చేశామని ప్రస్తుతం పంచాయతీ పట్టణంలో విలీన ప్రక్రియ జరుగుతున్నందున తాము మరమ్మతులు చేయడానికి అనుమతులు ఉండాలని వివరించారు. ఉన్నతాధికారులు స్పందించి ఈ వంతెన ఏ డిపార్ట్‌మెంట్ పరిధిలో ఉందో గ్రహించి ఆ డిపార్ట్‌మెంట్ అధికారులతో వేగవంతంగా మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

13న జాతీయ లోక్ అదాలత్

నరసాపురం: రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఈ నెల13న నరసాపురం కోర్టులో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్టు నరసాపురం మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, నరసాపురం పదో అదనపు జిల్లా జడ్జి పి.విజయదుర్గ చెప్పారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న మనోవర్తి కేసులు, గృహహింసకేసులు, చెక్‌బౌన్స్ కేసులు, రాజీ చేసుకోదగిన క్రిమినల్ కేసులు పరిష్కరించుకోవచ్చని చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ అయ్యేలా న్యాయవాదులు సహకరించాలని కోరారు.

రైతులకు మొక్కల పంపిణీ

మొగల్తూరు: జిల్లా నీటి యాజమాన్య సంస్థ ద్వారా ఉపాధి హామీ పథకంలో రైతులకు ఉచితంగా మొక్కలు పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ ఆర్‌సీ ఆనందకుమార్ మంగళవారం తెలిపారు. 5ఎకరాలలోపు మెట్ట లేదా 2.5 ఎకరాల మాగాణి ఉన్న ఉన్న అన్ని కులాకు చెందిన రైతులు అర్హులని, ఫీల్డ్ అసిస్టెంట్, సచివాలయంలోని డిజిటల్ అసిస్టెంట్ లేదా ఎంపీడీఓ లేదా ఉపాధి హామీ పథకంలోని ఏపీఓను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. అర్హులైన వారిని గుర్తించి రైతులకు కావాల్సిన మామిడి, జీడి మామిడి, సపోటా, కొబ్బరి, సీతాఫలం, దానిమ్మ, గులాబి, మల్లె తదితర మొక్కలను ఉచితంగా అందజేస్తామన్నారు.

నాటుసారా స్వాధీనం

మొగల్తూరు: స్థానిక కుక్కలవారితోటలో ఓ వ్యక్తి వద్ద ఉన్న తొమ్మిది లీటర్ల నాటుసారాను మొగల్తూరు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ముందస్తు సమాచారం మేరకు స్థానికుడు పాలా ఏసుబాబు ఇంటిపై దాడి చేసి అతని నుంచి సారా స్వాధీనం చేసుకున్నామని ఎస్సై ఎం. వీరబాబు తెలిపారు. నిందితుడిని అరెస్ట్ చేసి, కేసు నమోదు చేశామని వివరించారు.

ఆర్టీసీలో కారుణ్య నియామకాలకు ప్రణాళిక



డ్రైవర్లకు ప్రశంసా పత్రాలు అందిస్తున్న ఏపీ పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు జోనల్ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి

నరసాపురం: ఆర్టీసీ కార్మికుల కుటుంబాల సంక్షేమం దృష్ట్యా ప్రస్తుతం అమల్లో ఉన్న నిబంధనలు సరళీకృతం చేసి కారుణ్య నియామకాలు చేపట్టే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళిక తయారు చేస్తుందని ఏపీ పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు జోనల్ చైర్‌పర్సన్, బోర్డు డైరెక్టర్ తాటినేని పద్మావతి తెలిపారు. మంగళవారం ఆమె నరసాపురం ఆర్టీసీ డిపోను సందర్శించారు. ఇటీవల నూతనంగా అభివృద్ధి చేసిన బస్టాండ్‌ను పరిశీలించారు. కార్పొరేట్ తరహాలో బస్టాండ్‌ను నిర్మించడంపై ఆమె సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం ద్వారా సంస్థను, కార్మికులను ఆదుకునే దిశగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రయత్నించారని చెప్పారు. అలాగే రాష్ట్రంలోని అన్ని డిపోలను, బస్టాండ్‌లను అభివృద్ధి చేస్తున్నారని అన్నారు. సంస్థను లాభాల్లోకి తెచ్చే ప్రయత్నాలు సాగుతున్నాయని వివరించారు. కార్మికులు, ఉద్యోగులు సంస్థ అభివృద్ధికి నిబద్ధతతో పని చేయాలని సూచించారు. విధుల్లో ప్రతిభ చూపించిన కార్మికులకు అవార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రీజినల్‌మేనేజర్ ఎ. వీరయ్య చౌదరి, నరసాపురం డిపో మేనేజర్ ఎస్ సుబ్బన్న రెడ్డి పాల్గొన్నారు.

చలివేంద్రాల ప్రారంభం



పాలకొల్లులో చలివేంద్రం ప్రారంభిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక శ్రీ క్షీరారామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద చలివేంద్రం ప్రారంభించారు. జిల్లా పరిషత్ చైర్మన్ కవురు శ్రీనివాస్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మంగళవారం వైఎస్సార్ సీపీ నాయకులు కోరాడ శ్రీనివాసరావు, కావలి శ్రీనివాసరావులు ప్రారంభించారు. ఈ వేసవి కాలంలో చలివేంద్రాలు ఏర్పాటుచేయడానికి దాతలు మరింత ముందుకు రావాలని కోరారు. చిన గోపురం సెంటర్ శ్రీ అష్టభుజ లక్ష్మీనారాయణ స్వామి ఆలయం వద్ద చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు గాదె వెంకన్న తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి యాళ్ల సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

దగ్గులూరులో..

పాలకొల్లు అర్బన్: వేసవిలో బాటసారులకు చల్లని మంచినీరు అందించి దాహార్తిని తీర్చడం అభినందనీయమని సర్పంచ్ విశ్వనాథం కనకభద్రం అన్నారు. పాలకొల్లు మండలం దగ్గులూరు ఆల్ మదీనా మసీదు దగ్గర ఆల్ మదీనా ఫౌండేషన్ చైర్మన్ హాజీ షేక్ ధరమ్ మదీనా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మంగళవారం సర్పంచ్ కనకభద్రం ప్రారంభించారు. ఫౌండేషన్ చైర్మన్ హాజీ షేక్ ధరమ్ మదీనా మాట్లాడుతూ గత 25 ఏళ్లుగా మసీదు ఆవరణలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి బాటసారులకు చల్లని మంచినీరు అందిస్తున్నట్లు తెలిపారు. తొలిరోజు పుచ్చకాయ జ్యూస్ బాటసారులకు అందజేశారు. కార్యక్రమంలో మసీదు పెద్దలు షేక్ సిలార్ సాహెబ్, షేక్ కొండా షరీఫ్, షేక్ బాషా, షేక్ సుభాన్ సాహెబ్, చెల్లబోయిన రామిశెట్టి, వరద కనకరాజు, అందే కోటి వీరభద్రరావు, తాళ్ల కోటి నాగ మార్లింగం పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితురాలికి సహాయం



సుగుణమ్మకు ఆర్థిక సహాయం చేస్తున్న జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్

యలమంచిలి: మండలంలోని పెనుమర్రు గ్రామంలో రెండు రోజుల క్రితం జరిగిన అగ్ని ప్రమాదంలో తానేటి సుగుణమ్మ అనే వృద్ధ మహిళ పూరి గుడిసె పూర్తిగా తగలబడింది. దీంతో విషయం తెలుసుకున్న జెడ్పీ చైర్మన్, వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి కవురు శ్రీనివాస్ మంగళవారం పెనుమర్రు వెళ్లి బాధితురాలిని పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకుని ఓదార్చారు. తన వంతు సహాయంగా కొంత నగదు అందజేసిన శ్రీనివాస్ ప్రభుత్వం తరపున అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. బాధితురాలిని పరామర్శించిన వారిలో సర్పంచ్ కవురు గోపి, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ వైఎస్సార్ సీపీ పెనుమర్రు గ్రామ కమిటి అధ్యక్షుడు పాకా సూర్యనారాయణ గ్రామ ఉప సర్పంచ్ ముత్తాబత్తుల లక్ష్మీరాధ నాయకులు పొత్తూరి సోమరాజు, యడ్ల శ్రీనుకుమార్, బాలం ఆనంద్, నక్కా రాధ తదితరులు ఉన్నారు.

వైభవంగా పార్వతీవిశ్వేశ్వర స్వామి కల్యాణం



ఆలమూరులో శ్రీపార్వతీవిశ్వేశ్వరస్వామివారికి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

పెనుమంట్ర: మండలంలోని ఆలమూరు ఉన్న శ్రీపార్వతీసమేత విశ్వేశ్వరస్వామి దివ్య కల్యాణ మహోత్సవం సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన సత్తి నర్శిరెడ్డి, లక్ష్మీ పార్వతి దంపతులు కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. కల్యాణం అనంతరం నీరాజన మంత్రపుష్పం, దర్బారుసేవ, ఆశీర్వచనం, ప్రసాద వినియోగం అనంతరం నిత్యోపాసన, బలిహరణ కార్యక్రమాలు నిర్వహించారు. మంగళవారం ఉదయం గ్రామోత్సవం అనంతరం హోమ పూజలు, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. పార్వతి విశ్వేశ్వరస్వామికి శ్రీపుష్పయోగ మహోత్సవం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయ ట్రస్టు బోర్డు ఛైర్మన్ డీవీ శ్రీనివాసరెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యులు కె.వెంకట్రామరాజు, కొత్తా చినపల్లయ్య, గొలుగూరి పార్వతి, సీహెచ్ కనకదుర్గ, మామిడిశెట్టి లక్ష్మి, నార్కెడమిల్లి శ్రీను, కొడమంచిలి అన్నపూర్ణ, ఆలయ మేనేజర్ టీవీ గోవిందరావు సీనియర్ అసిస్టెంట్ డీవీవీఎస్ఆర్ ప్రసాదరాజు పాల్గొన్నారు.

10లోగా ఈకేవైసీ చేయించుకోవాలి

పెనుగొండ: రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఈ నెల 10 లోపు పెన్షనర్లు తప్పని సరిగా ఈకైవేసీ వేయాలని పాలకొల్లు పెన్షనర్ల కార్యవర్గ సభ్యుడు కట్టుంగ శ్రీమన్నారాయణ వల్లూరులో ఓ ప్రకటనలో కోరారు. వీరు విధిగా సీఎఫ్ఎంఎస్ ఐడీలను, ఆధార్ నంబరుకు లింక్ చేసి ఉన్న మొబైల్ నంబర్‌కు అనుసంధానం చేసుకోవాలని కోరారు. పాలకొల్లు ఎస్‌టీవో పరిధిలోని పాలకొల్లు ఎస్టీఓ కార్యాలయంలో ఈ కైవైసీ సదుపాయం ఉందని తెలిపారు.

రజకుల కమ్యూనిటీ భవన నిర్మాణానికి కృషి



తూర్పుపాలెంలో మాజీ మంత్రి శ్రీరంగనాథరాజును సత్కరిస్తున్న రజక సంఘ నాయకులు

పెనుగొండ: సిద్ధాంతంలో రజకుల కమ్యూనిటీ భవన నిర్మాణానికి నిధులు అందించడానికి కృషి చేస్తానని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. మంగళవారం తూర్పుపాలెంలో సిద్ధాంతం రజక సంఘ నాయకుల కలిసి ఘనంగా సత్కరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల సంక్షేమానికి పాటు పడుతున్నారన్నారు. దేశంలో ఎక్కడాలేని విధంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని అన్ని వర్గాలు వారు అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ చింతపల్లి గనిరాజు(చంటి), సంఘ నాయకులు పాల్గొన్నారు.

రూ.5లక్షల నష్టపరిహారం అందచేత

కొయ్యేటి పాడులో ఇటీవల విద్యుత్ షాక్‌తో మృతి చెందిన తమనంపూడి వీర వెంకట రెడ్డి కుటుంబ సభ్యులకు విద్యుత్ శాఖ అందించిన రూ.5 లక్షల నష్ట పరిహారాన్ని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అందించారు. మంగళవారం తూర్పుపాలెంలో జరిగిన కార్యక్రమంలో మృతుడు భార్య చైతన్య శ్రీకి రూ.5లక్షలు చెక్కును అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ కర్రి రాంబాబు రెడ్డి, దొంగ దుర్గా ప్రసాద్, తమనంపూడి కోదండ రెడ్డి, మేడపాటి సత్యనారాయణ రెడ్డిలు పాల్గొన్నారు.

రేపు అంబేడ్కర్ జయంతి ఉత్సవం

గురువారం కొడమంచిలి పంచాయతీ వద్ద నిర్వహించే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలకు హాజరు కావాలని కొడమంచిలి సంఘ నాయకుల మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు మర్యాదపూర్వకంగా కలిసి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆచంట మండల సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారాం, అంబేడ్కర్ యువసేన నాయకులు యల్లమెల్లి వెంకట రమణ, చెల్లా సుభాకర్, కొండేటి రమేష్, రొక్కాల రాజ్‌కుమార్, కోటే శశి మధులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో నిలిచిన విద్యుత్ సరఫరా

నరసాపురం: స్థానిక ఏరియా ప్రభుత్వాసుపత్రిలో షార్ట్‌సర్క్యూట్ కారణంగా వైరింగ్ కాలిపోవడంతో మంగళవారం సాయంత్రం 5 గంటలు నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అదే సమయంలో జనరేటర్ మరమ్మతులకు గురవడంతో ఆస్పత్రిలో చీకటి ఆవరించింది. దీంతో రోగులు అసౌకర్యానికి గురయ్యారు. విద్యుత్ సరఫరా పునరుద్ధరించడానికి మరమ్మతులు చేయిస్తున్నామని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జనార్దన్‌బాబు చెప్పారు.

విగ్రహ ప్రతిష్టాపనోత్సవాలు ప్రారంభం



దాసాంజనేయస్వామివారి విగ్రహ ప్రతిష్టాపనలో పాల్గొని పూజలు చేస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: భక్తిబావం, సేవాబావంతో ఉంటే ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లుతారని పలువురు పెద్దలు పాల్గొన్నారు. మంగళవారం తూర్పుతాళ్లు గ్రామం చామకూరివారి మెరకలోని శ్రీశ్రీశ్రీ దాసాంజనేయస్వామివారి ఆలయ ప్రతిష్టా మహోత్సవం ప్రారంభించారు. పెద్దింటి అనిల్ కుమారాచార్యులు సిద్ధాంతితో నిర్వహించే ప్రతిష్టా మహోత్సవ కార్యక్రమాలు బుధవారం, గురువారం రోజుల్లో కూడా జరుగనున్నాయి. బుధవారం మధ్యాహ్నం 2గంటలకు స్వామి వారి ఊరేగింపు. గురువారం ఉదయం 7.12గంటలకు ప్రతిష్టాపన మహోత్సవం నిర్వహిస్తారని కమిటీ సభ్యులు పేర్కొన్నారు. కార్యక్రమంలో బొక్కా పోతురాజు, చామకూరి వెంకట రామయ్య, చామకూరి కొండలరావు, రాజేంద్రరెడ్డి, విషాల్, కూనరాజు సత్యం, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

వలంటీరు వివాహానికి హాజరైన శ్రీరంగనాథరాజు



పెనుగొండ వలంటీరు శ్రీవల్లిని ఆశీర్వదిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుగొండ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేస్తున్న వలంటీరు వివాహానికి మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఆశీర్వదించారు. మంగళవారం పెనుగొండకు చెందిన శ్రీవల్లి వివాహం మంగళవారం జరిగింది. దీంతో స్వయంగా మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు హాజరై వలంటీర్లపై ఉన్న మక్కువను చాటుకొన్నారు. మాజీ మంత్రి శ్రీరంగనాథరాజుతో పాటు వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి మేడపాటి సాయి చంద్రమౌళీశ్వర రెడ్డి, ఎంపీపీ పూతినీడి వెంకటేశ్వరరావు(పెద్ద), పట్టణ అధ్యక్షుడు తిక్కిరెడ్డి పవన్ కుమార్, పోడూరి అప్పాజీలు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులు బోనస్ చెల్లించాలి

పెనుగొండ: అకాల వర్షంతో నష్టపోయిన రైతులకు క్వింటాలకు రూ.500 బోనస్ ప్రకటించాలని ఏపీ కౌలు రైతు సంఘ నాగిశెట్టి గంగారావు డిమాండ్ చేశారు. మంగళవారం పెనుగొండ మండలంలో అకాల వర్షంతో నష్టపోయిన కౌలు రైతులను పరామర్శించి. నష్టపోయిన పంట వివరాలను అడిగి తెలుసుకున్నారు. గాలికి వరిచేలు పడి పోయాయన్నారు. ధాన్యం రాలిపోయి మొలకలు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం సత్వరం స్పందించి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలోషేక్ పాదుషా, తొంటా సత్యనారాయణలు పాల్గొన్నారు.

జుత్తిగ దేవస్థానం చైర్మన్ శ్రీరామారావు మృతి



శ్రీరామారావు(ఫైల్)

పెనుమంట్ర: జుత్తిగ గ్రామంలోని శ్రీఉమావాసుకి రవిసోమేశ్వరస్వామి దేవస్థానం అనువంశిక ధర్మకర్తలి(చైర్మన్) సత్తిరాజు వెంకట శ్రీరామరావు(91) మంగళవారం ఉదయం హైదరబాద్‌లో మృతి చెందినట్లు ఆయన బంధువులు తెలిపారు. శ్రీరామరావుకు ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఆయన 1997 నుంచి వంశపారంపర్య ధర్మకర్తగా ఉంటూ ఆలయ చైర్మన్‌గా పని చేస్తున్నారు. ఆయన మృతిపై గ్రామసర్పంచ్ తమనంపూడి వీర్ దేవస్థానం ఈఓ సాయి ప్రసాద్, ధర్మకర్తలి మండలి సభ్యులు వెలగల వెంకట సోమిరెడ్డి, చిలుకూరి విశ్వనాథ్, పీవీ సత్యనారాయణసారధి, పి. వెంకటలక్ష్మి తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

భూములపై నాణ్యమైన రీ సర్వే చేయాలి

సాక్షి, భీమవరం : రీ సర్వేలో అందరూ భాగస్వాములై టీం వర్క్ చేస్తే నాణ్యమైన రీ సర్వే జరుగుతుందని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. మంగళవారం రాత్రి ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల సమావేశ మందిరంలో రెవెన్యూ అధికారులకు రీ సర్వేపై వర్క్ షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి ఒక కచ్చితమైన రికార్డు తయారు చేస్తారని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని కలెక్టర్ సూచించారు. నిబంధనల ప్రకారం ప్రణాళిక బద్ధంగా రీ సర్వే చేయాలని అన్నారు. జాయింట్ కలెక్టర్ ఎస్. రామ్ సుందర్ రెడ్డి మాట్లాడుతూ రీ సర్వే మిరర్ ఇమేజ్, గ్రౌండ్ రియాలిటీ ప్రకారం జరగాలని, ప్రభుత్వ భూములకు గతంలో ఉన్న సరిహద్దులను మాత్రమే తీసుకోవాలని సూచించారు. పట్టా భూమి ఎవరైతే ఎంజాయ్ మెంట్‌లో ఉన్నారో సరిచేసుకోవాలి అన్నారు. ఫేషియల్ డేటాకు టెక్స్ట్ డేటాకు తేడా రాకూడదని, గ్రామ సరిహద్దులు సరిచేసుకోవాలన్నారు.